## క్లుప్తంగా

### స్పందన రద్దు


ఎం.దీపిక, ఎస్పీ

విజయనగరం క్రైమ్: సార్వత్రిక ఎన్నికలకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేయడంతో జిల్లాలో ఎన్నికల కోడ్ అమలు లోకి వచ్చింది. ఈ నేపథ్యంలో జిల్లాలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రతీ సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు రద్దు చేస్తున్నట్లు ఎస్పీ ఎం.దీపిక ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

### ఐక్యతతోనే హక్కుల సాధన


మాట్లాడుతున్న రాష్ట్ర రైతుకూలి సంఘం అధ్యక్షురాలు ఝాన్సీ

పూసపాటిరేగ: కార్మికులంతా ఐక్యతగా ఉంటూ తమ హక్కులు సాధించుకోవాలని రైతుకూలి సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ పిలుపునిచ్చారు. మండలంలోని సీహెచ్ అగ్రహారంలో ఉన్న మైలాన్ వర్కర్స్ యూనియన్ భవనంలో ఆదివారం నిర్వహించిన కామ్రేడ్ పెద్దన్న సంస్మరణ సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. కామ్రేడ్ పెద్దన్న కార్మిక లోకానికి చేసిన సేవలను కొనియాడారు. తమ శ్రమను దోచేస్తున్న పరిశ్రమ యాజమాన్యాలపై కార్మికులు పోరాడాలన్నారు. ప్రతీ కార్మికుడికి కనీస వేతన చట్టం అమలు అయ్యే దిశగా కార్మిక సంఘాలు చూడాలి కోరారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ పండా, రైతుకూలి సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి వర్మ, కార్మిక సంఘం నాయికులు బాస్కర్, సురేస్, రెడ్డి నారాయణరావు, వెంకటరామయ్య, అప్పలనాయుడు, జీవీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

### అలరించిన సినీ సంగీత విభావరి


పాటలు పాడుతున్న గాయనీ, గాయకులు

విజయనగరం టౌన్: స్థానిక గురజాడ గ్రంథాలయం ఆవరణలో ఆదివారం రాత్రి నిర్వహించిన సంగీత విభావరి శ్రోతలను అలరించింది. ఘంటసాల స్మారక కళాపీఠం ఆధ్వర్యంలో కేవీ మహదేవన్ సంగీత సారథ్యంలో గాయనీ, గాయకులు ఎస్పీ బాలు పాడిన ఆపాత మధురాలను ఆలపించారు. కళాపీఠం వ్యవస్థాపకులు ఎం.భీష్మారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కీబోర్డుపై సాయి పవన్, తబలపై చక్రపాణి సంగీత సహకారం అందించారు. కార్యక్రమంలో జయంతికుమారి, కావ్య, చంద్రిక, శుభ, సులోచన, మమత, తదితరులు పాల్గొన్నారు.

### నేడు ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

విజయనగరం టౌన్: స్థానిక నాగోజీపేట మయూరీ జంక్షన్ వద్ద ఉన్న సంపత్ ఆంజనేయస్వామి ఆలయ 13వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు ఇసరపు శేఖర్ యాదవ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం విఘ్నేశ్వర పూజతో పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. వెలవలపల్లి కృష్ణగాయత్రి శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి సీతారామ విశిష్ట పూజ, నక్షత్ర కలశాభిషేకం, పంచామృతాభిషేకం, సంపత్ ఆంజనేయస్వామి హోమం, తమలపాకులతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావాలని కోరారు.

### పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

పూసపాటిరేగ: పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు.

విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరీక్ష కేంద్రాల్లో అన్ని వసతులు ఏర్పాటు చేశారు. నెల్లిమర్ల నియోజకవర్గంలో పూసపాటిరేగ, డెంకాడ, భోగాపురం, నెల్లిమర్ల మండలాల నుంచి 4,611 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. పూసపాటిరేగ మండలంలో 6 కేంద్రాల్లో 1,470 మంది, డెంకాడ మండలంలో 3 కేంద్రాల్లో 700 మంది, నెల్లిమర్ల మండలంలో 8 కేంద్రాల్లో 1,660 మంది, భోగాపురం మండలంలో 5 కేంద్రాల్లో 781 మంది విద్యార్థులు పరిక్షలు రాయనున్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో బెంచీలు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్లు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది.

# అంబరాన్నంటిన ఎల్లమ్మ సంబరం


విజయనగరం టౌన్: పూజలందుకుంటున్న ఎల్లమ్మ తల్లి

- భక్తిశ్రద్ధలతో సిరిమానోత్సవం
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు

విజయనగరం టౌన్/నెల్లిమర్ల రూరల్/డెంకాడ: అమ్మా.. ఎల్లమ్మ తల్లీ.. చల్లంగ చూడమ్మా.. అని కోరుకుంటూ భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. విజయనగరం జిల్లా కేంద్రంలోని బాలాజీ జంక్షన్‌లో ఉన్న ఎల్లమ్మ ఆలయం వద్ద, నెల్లిమర్ల మండలం సతివాడలో, డెంకాడ మండలం పెదతాడివాడ గ్రామంలో ఆదివారం ఎల్లమ్మ తల్లి సిరిమానోత్సవం ఘనంగా నిర్వహించారు. వేలాదిగా భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. పసుపు,కుంకుమతో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం అమ్మవారి సిరిమానును వీధుల్లో మూడుసార్లు ఊరేగించారు. సిరిమానోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.


విజయనగరం టౌన్: సిరుల మహోత్సవం


విజయనగరం టౌన్: అమ్మవారి దర్శనానికి బారులుతీరిన భక్తులు


విజయనగరం టౌన్: ఉత్సవంలో ఉత్సాహంగా డాన్స్ చేస్తున్న చిన్నారులు


విజయనగరం టౌన్: చిరువ్యాపారుల సందడి


విజయనగరం టౌన్: ఆలయ ప్రాంతంలో జాతర సందడి


విజయనగరం టౌన్: సిరిమాను అధిరోహించేందుకు వస్తున్న పూజారి


నెల్లిమర్ల రూరల్: సతివాడలో ఎల్లమ్మతల్లి సిరిమానోత్సవం


నెల్లిమర్ల రూరల్: అమ్మవారిని దర్శించుకుంటున్న ఎంపీపీ అంబళ్ల సుధారాణి దంపతులు


డెంకాడ: పెదతాడివాడలో అగ్నిగుండం తొక్కుతున్న పూజారి ఎల్లయ్య


డెంకాడ: ఎల్లమ్మతల్లిని దర్శించుకునేందుకు క్యూలో ఉన్న భక్తులు

# వైఎస్ జగన్‌తోనే సంక్షేమ పాలన

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు
- కనిమెల్లలో ఎన్నికల ప్రచారం

పూసపాటిరేగ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమ పాలన సాధ్యమని.., కుల, మత పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన జగనన్నకు ప్రజలు మరోసారి అండగా నిలచి ఆశీర్వదించాలని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు కోరారు. మండలంలోని కనిమెల్ల, కామవరం, అల్లడపాలెం గ్రామాల్లో ఆదివారం ఎన్నికల ప్రచారాన్ని లాంఛనంగా ప్రారంభించారు. గ్రామస్తులు వారికి ఘన స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి ఐదేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. నెల్లిమర్ల నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే అప్పలనాయుడు కోరారు. గ్రామ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థలతో ప్రజలకు ప్రభుత్వ సేవలను చేరువ చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ ఐదేళ్లలో దేశం మెచ్చుకునే విధంగా పాలన అందించారని కొనియాడారు. మాజీ సీఎం చంద్రబాబునాయుడు మాయమాటలతో ప్రజల వద్దకు వస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. టీడీపీ, జనసేన, బీజేపీల కుమ్ములాటలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేసి, ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మహంతి కల్యాణి, జెడ్పీటీసీ మహంతి సీతాలక్ష్మి, జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్దనరావు, అల్లాడ రమేష్, ఎస్.సత్యనారాయణరాజు, దాడిశెట్టి త్రినాథరావు, నడిపేన రమణ, బర్రి చినఅప్పన్న, గుజ్జు సురేష్‌రెడ్డి, గాబు సూరప్పన్నరెడ్డి, కోట్ల రఘు, మహంతి లక్ష్మణరావు, పతివాడ సత్యం, ఎడ్ల రామకృష్ణ, శాంతాటి శ్రీనివాసరావు, రోశయ్య, పి.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


కనిమెల్లలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ సురేష్‌బాబు, తదితరులు

## నైతిక విలువలతో కూడిన విద్య బోధించాలి

కొత్తవలస: పాఠశాలల్లో విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యను బోధించాలని ఉపాధ్యాయులకు కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి ఎస్.విజయ చంద్ర సూచించారు. స్థానిక సబ్బవరం రోడ్డులోని విజ్ఞాన భారతి పాఠశాల వార్షికోవత్సం శనివారం రాత్రి నిర్వహించారు. అతిథి గా హాజరైన జడ్జి విజయచంద్ర మాట్లా డుతూ పిల్లలకు నైతిక విలువలు నేర్పినప్పుడే సమాజంలో నేరాలు తగ్గుతాయన్నారు. ఈసందర్భంగా చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. బీవీకే సంస్థల పరిపాలన అధికారి కన్నన్, వైద్యులు తెన్నేటి సుబ్బారావు, పాఠశాల ప్రినిపాల్ కె.సత్యనారాయణ, విద్యార్థుల తల్లిదండ్రు లు పాల్గొన్నారు.


జ్యోతి వెలిగించి పాఠశాల వార్షికోత్సవాలను ప్రారంభిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి విజయచంద్ర

### కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లిమర్ల: కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి 6వ తరగతి, ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్(ఎంపీసీ)లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఉమా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేజీబీవీల్లో ఇంగ్లిష్ మీడియం బోధన, వసతి, భోజన సదుపాయం, విద్యార్థుల చదువులపై ఉపాధ్యాయుల నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. మండలంలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు విద్యార్థుల తల్లిదండ్రులకు అడ్మిషన్ల సమాచారం తెలియజేయాలని కోరారు.

# అభివృద్ధి చేశాం.. సంక్షేమం అందించాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

- టిక్కెట్ ఖరారు చేసిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు
- నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తాం..ఆశీర్వదించండి
- గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

గజపతినగరం: అయిదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గజపతినగరం నియోజకవర్గంలో మును పెన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు చేశామని, ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించామని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ తనపై నమ్మకంతో రెండోసారి గజపతినగరం అసెంబ్లీ స్థా నం నుంచి పోటీ చేసేందుకు వైఎస్సార్‌సీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవకాశం కల్పించారని, ఆయనకు తన కృతజ్ఞతలు తెలిపారు.ఈ అయిదేళ్లలో గజపతినగరం నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమా లు చేశామని తెలిపారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, ఇంటింటికీ తాగునీటి కుళాయిలు, సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం వంటి పనులను చేశామన్నారు. నియోజకవర్గ కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ సిస్టమ్, రోడ్డు విస్తరణ, 30 పడకల సామాజిక ఆస్పత్రిని 100పడకల స్థాయికి పెంచి నూతన భవనాల నిర్మాణం, బైపాస్ రోడ్డు నిర్మాణం చేశామని తెలిపారు. నాడు–నేడులో భాగంగా పాఠశాలల రూపురేఖలు మార్చామని, సచివాలయా లు, హెల్త్ వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేసి ప్రజలకు ప్రభుత్వ, వైద్య సేవలను చేరువచేశామని వివరించారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ పథకాలు అందించామని చెప్పారు. ఎన్నికల్లో పార్టీ విజయం కోసం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పని చేయాలని కోరారు. ఎమ్మెల్యేకు జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు కె.ఆదినారాయణ, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు ఎస్.పైడిరా జు, తుమికాపల్లి సర్పంచ్ బెల్లాన త్రినాథరావు, పార్టీ సీనియర్ నాయకులు పి.నారాయణమూర్తి, రేగ సురేష్, కె.సుబ్రహ్మణ్యం, కె.రామునాయుడు, కర్రి నానాజీ, ఆళ్తి రామునాయుడు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

# ఎన్నికల కోడ్ పక్కాగా అమలు


నెల్లిమర్ల: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రామారావు

నెల్లిమర్ల: ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) పక్కాగా అమలు చేయాలని ఎంపీడీఓ జి.రామారావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏఆర్‌ఓ డి.ధర్మరాజు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిపై సిబ్బందికి అవగాహన కల్పించారు. కోడ్ పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. పబ్లిక్ స్థలాలను ఎన్నికల ప్రచారానికి వాడుకోరాదని, రాజకీయ పార్టీల జెండాలు, పోస్టర్లను తొలగించాలని, నేతల విగ్రహాలకు ముసుగులు వేయాలని సూచించారు. ఇళ్లపై పార్టీల జెండాలు ఉంటే యజమాని అనుమతి తప్పనసరిగా తీసుకోవాలన్నారు. ఎక్కడైనా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అతిక్రమిస్తే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి కేసు నమోదు చేయాలని సూచించారు. పార్టీల తీరుపై నిశితంగా దృష్టి సారించింది ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలు చేయాలని సూచించారు. సమావేశంలో ఈఓపీఆర్డీ కె.సింహాద్రి, తదితరులు పాల్గొన్నారు.

- డెంకాడ: సార్వత్రిక ఎన్నికల ప్రకటన రావడంతో ఎన్నికల కోడ్ అమలుపై అధికారులు దృష్టి సారించారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన రాజకీయ పార్టీల ప్రచార పోస్టర్లు, బ్యానర్లు, ఫ్లెక్సీలను పంచాయతీ సిబ్బంది సాయంతో తొలగించే పనిలో నిమగ్నమయ్యారు.


విజయనగరం అర్బన్: పట్టణంలో రాజకీయ నాయకుని విగ్రహానికి తొడిగిన ముసుగు

**విగ్రహాలకు ముసుగులు**

విజయనగరం అర్బన్: ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి కోడ్ అమలులోకి వచ్చింది. ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేసేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంది. పబ్లిక్ ప్రదేశాల్లో ఉన్న రాజకీయ పార్టీల పోస్టర్లు, ఫ్లెక్సీలను 24 గంటల్లోపు, ప్రైవేటు స్థలాల్లో ఉన్న బ్యానర్లు, జెండాలు, పోస్టర్లను 48 గంటల్లోపు తొలగించాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రంలోగా ప్రభుత్వ కార్యాలయాల్లోని ప్రకటనలను అధికారులు తొలగించారు.

# క్రీడలతో మానసిక ఉల్లాసం


వాలీబాల్ క్రీడాకారులతో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

కొత్తవలస: క్రీడలు మానసిక ఉల్లాసానికి, దేహదారుఢ్యానికి దోహదపడతాయని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని వడ్డిపేట గ్రామంలో గ్రామ దేవత పండగ సందర్భంగా ఆదివారం రాత్రి నిర్వహించిన మండల స్థాయి వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలకలో రాణించే వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి క్రీడాకారులను ఎంతగానో ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు 'ఆడుదాం–ఆంధ్ర' పేరిట రాష్ట్ర వ్యాప్త టోర్నమెంట్‌ను ఇటీవల నిర్వహించారన్నారు. వాలీబాల్ టోర్నమెంట్ విజేతకు రూ.10 వేల నగదు బహుమతి అందజేయనున్నామని నిర్వాహకులు తెలిపారు. పీఏసీఎస్ అధ్యక్షుడు గొరపల్లి శివ, స్థానిక సర్పంచ్ విరోతి కొండలరావు, వైఎస్సార్‌సీపీ ఎల్.కోట మండల అధ్యక్షుడు గుమ్మడి సత్యనారాయణ, నాయకులు బి.ఎ.నాయుడు, రామకృష్ణ పాల్గొన్నారు.